
# చిల్లరమనిషి

కట్టా రాంబాబు



కొంతమందిని చూస్తుంటే మనకి కొన్ని కొన్ని సంఘటనలు గుర్తుకొస్తుంటాయి. టికెట్ తీసుకున్న వెంటనే చిల్లర అడిగాడని ఓ పల్లెటూరి పాసింజర్ని నానా మాటలంటున్న కండక్టర్ని చూస్తుంటే నాకు గతంలో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది ఆ బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు.

నేనప్పుడు ఓ ఇరవై రోజుల పాటు ప్రతి రోజూ ఒంగోలు వెళ్ళి రావలసి వచ్చేది. నాగార్జున యూనివర్శిటీవారు ఒంగోల్లోని ఏ.బి.ఎం కాలేజీకి స్పాట్ వాల్యూయేషన్ సెంటరిచ్చారు. ఫైనలియరు డిగ్రీ పేపర్లు దిద్దడానికి పిలుపు రావడంతో వెళ్ళక తప్పలేదు.

ఒంగోలు మా వూరికి ఏబయి కిలో మీటర్ల దూరంలో వుండటంతో రోజూ వెళ్ళి రావాలని నిర్ణయించుకున్నాను. రోజూ పాతిక పేపర్లు దిద్దడం, సరదాగా పాత మిత్రులతో కబుర్లు చెప్పడం, వేసవి సెలవులు కావడంతో కాలక్షేపంగా బాగానే వుండేది.

రోజూ ఉదయం కనిగిరి నుంచి ఒంగోలు పోయే సింగిల్ స్టాప్ బస్సు ఎక్కితే గంటన్నరకల్లా చేరుకునేవాడిని. మళ్ళీ మధ్యాహ్నం భోజనానికి యింటికి వచ్చేసేవాడిని. మా వూరి నుంచి ఒంగోలు పోవడానికి టికెట్ అప్పుడు పద్నాలుగు రూపాయలుండేది. నేను అన్ని రోజులు తిరగటంతో కండక్టర్లతో బాగానే పరిచయం పెరిగింది. ఒకతనయితే ఫ్రెండయిపోయాడనికూడా చెప్పొచ్చు. సుమారు పది రోజుల పాటు అతనే రోజూ కాకపోయినా బస్సులో తగులు తుండేవాడు. మొదటి రోజే నా ఉద్యోగం, నేను ఎందుకు వెళ్ళి వచ్చేది తెలుసుకున్నాడు. అందుచేత నేనంటే కొంచెం గౌరవం చూపించి సీటు ఆఫర్ చెయ్యడం, విష్ చెయ్యడం లాంటివి చేస్తుండేవాడు. టికెట్ ఖరీదు పద్నాలుగు రూపాయిలైనా చిల్లర లేకో లేక కరెక్టుగా అంతే యివ్వడానికి మరేదో అడ్డొచ్చి పదిహేను రూపాయలిచ్చేవాణ్ణి. అతను చిల్లర ఇచ్చేవాడు కాదు. నేనూ అడిగే వాణ్ణికాదు. టికెట్ చేతిలో పెట్టి ఓ వెర్రి నవ్వు నవ్వేవాడు.

అలా పది రోజుల పాటు అతనికి, మిగిలిన రోజులు మిగతా కండెక్టర్లకు రోజూ రెండేసి రూపాయల చొప్పున యిచ్చి నష్టపోతుండేవాడిని. నేను చూసినంత వరకు అందరూ కాకపోయినా చాలా మంది కండక్టర్లు చిల్లర తిరిగి ఇవ్వరు.క్యాష్ బ్యాగ్‌లో చిల్లరున్నా కూడా యివ్వకుండా టికెట్ వెనుకాల రాస్తారు. దిగే కంగారులో మరిచి పోయేవాళ్ళు చాలా మంది ఉంటారు. ముఖ్యంగా చదువురాని వాళ్ళు, పేదోళ్ళ దగ్గర నుంచి చిల్లర కొట్టేస్తుంటే చాలా బాధ అనిపిస్తుండేది. ఒకవేళ ఎవరైనా టికెట్‌కు సరిపడా చిల్లర యిస్తే వాళ్ళ వంక చాలా నిరసనగా చూసి టికెట్‌ని విసురుగా వాళ్ళ చేతిలో పెడతారు. తిరిగి చిల్లర అడిగేవాళ్ళని, కరెక్టుగా టికెట్ డబ్బులు ఇచ్చేవాళ్ళని వాళ్ళు శత్రువుల్లా చూస్తారు. అందుకని నేను వాళ్ళ దృష్టిలో శత్రువులా ఎందుకుండాలని పదిహేను రూపాయలిస్తుండేవాడిని.

వాల్యూషను రేపటితో ముగుస్తుందని ముందు రోజే చెప్పేశారు. ఆ రోజు టి.ఏ, డి.ఏ

బిల్సు, రెమ్యూనరేషను బిల్సు సబ్మిట్ చేశామంతా. మర్నాడు వాల్యూషను వర్కు పూర్తి చేసి డబ్బులు తీసుకుంటామనే వుద్దేశంతో 2 ఏబయి రూపాయలు జేబులో వేసుకుని బయలుదేరాను. బస్సులో అతనే కండక్టరు. టికెట్ కోసం ఏబయి నోటిచ్చాను. ఎందుకో అతను చాలా ముభావంగా వున్నాడు. రోజులా విష్ చెయ్యలేదు. సీటు ఆఫర్ చెయ్యలేదు. అవేం నేను పట్టించుకోలేదు. టికెట్‌తో పాటు ముప్పయైదు రూపాయలు నా చేతిలో పెట్టాడు. బస్ దిగి కాలేజీకి బస్టాండ్ నుంచి రోజులాగే అయిదు రూపాయలిచ్చి ఆటో ఎక్కాను.

మధ్యాహ్నం ఒంటి గంటకల్లా వర్కు పూర్తి చేసుకుని రెమ్యూనరేషను గురించి అడిగితే బేంకుకెళ్ళిన క్లర్కు యింకా రాలేదని ఓ గంట అయ్యాక రమ్మని చెప్పడంతో టిఫిన్ చేద్దామని ఫ్రెండ్‌తో కలిసి ట్రంకురోడ్డుకొచ్చాను. ఇద్దరం టిఫిన్ తిని టీ తాగడం వలన ఆయన పదిహేను రూపాయల బిల్లు నేనే యిచ్చాను. నెమ్మదిగా నడుచుకుంటూ కాలేజీ దగ్గరకొచ్చేసరికి రెండు కావస్తోంది. తీరా అక్కడి కెళ్ళింతర్వాత బాంబులాంటి వార్త పేల్చారు. ఈ రోజు బేంకులో చెక్ క్యాష్ కాలేదట. డబ్బులు రేపిస్తారట. చాలా కోపం వచ్చింది. కానీ చేసేదేం లేక రేపు రావచ్చులే అని అక్కడ నుంచి రోడ్డు మీద కొచ్చి జేబులో చూస్తే సరిగ్గా పదిహేను రూపాయలే వున్నాయి. ఆటో ఎక్కితే బస్సుకి సరిపోవు. పోనీ ఏవరినైనా అడుగుదామన్నా మనస్సు ఒప్పుకోలేదు. అందుచేత నడుచుకుంటూ బస్టాండ్‌కెళితే టికెట్‌కి సరిపోతాయని నడక ప్రారంభించాను. మంచి ఎండాకాలం కావడంతో సగం దూరం నడిచేసరికి దాహం మొదలయ్యింది. తప్పనిసరి పరిస్థితిలో ఒక రూపాయి ఖర్చుపెట్టి సోడా తాగాను. మిగిలిన పద్నాలుగు రూపాయలు టికెట్‌కని వుంచి బస్టాండ్‌లో అడుగు పెట్టాను.

సరిగ్గా ఉదయం ఎక్కిన సింగిల్ స్టాప్ బస్సే వుంది. అతనే కండక్టరు. హమ్మయ్య అనుకుంటూ బస్సెక్కాను. బస్సు చాలా రష్‌గా వుంది. నేనెక్కడం వెంటనే బయలుదేరడం జరిగింది.

కండక్టరు వెనుక నుంచి టిక్కెట్లు కొట్టుకొస్తున్నాడు. అతను నా దగ్గరకొచ్చేసరికి బైపాస్ రోడ్డు వరకు బస్సు వచ్చేసింది. నేను టిక్కెట్లు డబ్బు అతని చేతిలో పెట్టాను. అతను ఆ డబ్బుల వంక, నా వంక చూసి "ఏం సార్ ఏ లోకంలో వున్నారు?'' అన్నాడు.

ఏమిటిలా అంటున్నాడని ఆశ్చర్యంగా అతని వంక చూశాను.

"ఇంకో రూపాయివ్వండి''అన్నాడు.

"ఎందుకు? పద్నాలుగేగా!'' అన్నాను.

"అందుకే ఏ లోకంలో వున్నారని అడిగింది'' అన్నాడు మళ్ళీ.

"నాకర్థం కావడం లేదు'' అన్నాను.

"ఇందులో అర్థమవ్వడానికేముంది సార్! ఈ రోజు ఆర్టీసి చార్జీలు పెరుగుతున్నాయని ఎప్పుడో అనౌన్సు చేశారుగా! అందుకే పెరిగిన రూపాయి యిమ్మని అడుగుతున్నాను''అన్నాడు.

"ఉదయం టికెట్ పాత రేటుకే యిచ్చినట్లున్నావు'' అడిగాను.

"భలేవారే సార్! ఉదయం యిచ్చింది కొత్త రేట్లదే. టిక్కెట్టుంటే చూడండి''అన్నాడు.

జేబులో చూశాను వుందేమోనని. కాగితాల మధ్య వుంది. చూస్తే పదిహేను రూపాయలే వుంది. అందుకేనేమో ఉదయం టికెట్లు యిచ్చేటప్పుడు కండక్టరు ముభావంగా వున్నది.

ఆర్టీసి రేట్లు ఈ రోజు నుంచే పెరుగుతున్నాయన్న సంగతి నాకు గుర్తే లేదు.

యిపుడేం జెయ్యాలి? నా దగ్గర యింక చిల్లరేమీ లేదు. అదే అన్నానతనితో "చిల్లర లేదు రేపిస్తాలే'' అని.

దానికతను వ్యంగ్యంగా ఒక నవ్వు నవ్వి "ఇదేం కూరగాయల దుకాణంకాదు సార్! రేపో, ఎల్లుండో యివ్వడానికి గవర్నమెంటు బస్సు. వుంటే రూపాయివ్వండి లేదా దిగండి'' అన్నాడు నిర్మొహమాటంగా.

అతనా మాటలంటుంటే నాకు చాలా బాధనిపించింది. రోజూ రెండు రూపాయలు చొప్పున సుమారు పది రోజుల పాటు ఇరవై రూపాయలు పుచ్చుకుని వుంటాడు. ఆ డబ్బుల కోసం ప్రతి రోజూ దొంగ నమస్కారాలు పెడుతూ, మర్యాద యిచ్చినట్లు నటిస్తూ నా దగ్గర లాగేసేవాడు. కానీ యిప్పుడవన్నీ మరచిపోయి అతనిలా మాట్లాడితే మనుషులు ఎంతెలా మారిపోతారో కదా అనిపించింది. అప్పటికీ నెమ్మదిగా అతనికే వినపడేటట్లుగా- "రోజూ టిక్కెట్టుకు రూపాయి ఎక్కువిస్తున్నాను కదా! ఈ ఒక్క రూపాయి కోసం అలా మాట్లాడతావేమిటి? ఒక్క రోజులోనే నన్ను మరచిపోయావా? అయినా రేపు యిస్తానన్నానుగా'' అని చెప్పాను.

అతను పెద్ద నోరు పెట్టుకొని "రోజూ మీలాంటి వాళ్ళు సవాలక్ష మంది ఎక్కి దిగుతుంటారు. మీకు చిల్లర రావలసి వుంటే దిగేటప్పుడు అడిగి తీసుకోవాలి గాని మీరు మరచిపోయి మేమేదో దోచుకున్నట్లు మాట్లాడుతారేమిటి? డబ్బులిస్తారా? లేక బస్సు దిగుతారా?'' అన్నాడు. నాకు తల తీసేసినంత పనయ్యింది. అతని చేతిలో నుంచి పద్నాలుగు రూపాయలు తీసుకుని "దిగుతాను బస్సాపు'' అన్నాను కోపంగా. బస్సాగింది. బస్సు దిగి డోరు బలంగా వేశాను.

ఆ తర్వాత కాస్సేపటికే వచ్చిన పాసింజరు బస్సెక్కి పన్నెండు రూపాయలకే మా వూరు పోదిలి చేరుకున్నాను. ఎప్పుడు బస్సెక్కినా చిల్లర మనస్తత్వంతో, చిల్లర కోసం కక్కుర్తి పడే ఆ చిల్లర మనిషే గుర్తొస్తుంటాడు. ఇలాంటి చిల్లర మనుషుల వల్లే కదా నిజాయితీగా వుండే కండక్టర్లకి కూడా చెడ్డ పేరొచ్చేదనిపించింది.

❋

